
సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 10 । ఏప్రిల్ । 2023




వరికి తెగులు!
వరి గింజ గట్టిపడకుండా పొల్లుపోతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. తెగులు నుంచి రక్షణకు మందులు చల్లాలని అధికారులు సూచిస్తున్నారు. 8లో



గంజాయి సరఫరా ముఠా అరెస్ట్
గంజాయి అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 120కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 8లో



ప్రమాదకరంగా ముళ్లచెట్లు
అధికారుల నిర్లక్ష్యంతో గ్రామీణ రహదారులు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయాయి. ఫలితంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. 9లో



ఆ ఫిష్‌కు ఫిదా

నోరూరిస్తున్న సింగూరు చేపలు

పుల్‌కల్(అందోల్): మహారాష్ట్రలోని పర్వతశ్రేణుల నుంచి మంజీరానది ప్రవాహం మొదలవుతుంది. ఈ నీటిలో మినరల్స్ ఎక్కువగా ఉంటాయి. సింగూరు డ్యామ్‌లో పెరిగే చేపలూ రుచిరకంగా ఉండటంతో వీటికి డిమాండ్ అధికంగా ఉంటుంది. అందుకే సింగూరుకు వచ్చే పర్యాటకులు ఆహా ఏమి రుచి తినరా మైమరచి అని పాటలు పాడుతూ లొట్టలేస్తుంటారు. చేపలు అంతటా దొరుకుతున్నా సింగూరు డ్యామ్‌లో దొరికే చేప రుచే వేరబ్బా అని కితాబిస్తుంటారు.



ప్రాజెక్టు వద్ద చేపలు విక్రయిస్తున్న మత్స్యకారులు

- సంగారెడ్డి జిల్లాలో ఏకైక భారీ ప్రాజెక్టు సింగూరు కావడంతో మత్స్యకారులు చేపల వృత్తిని జీవనాధారంగా చేసుకొని ఉపాధి పొందుతున్నారు. దీనికి తోడు మత్స్య శాఖ చేపల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వడంతో సింగూరు డ్యామ్ చేపల ఉత్పత్తికి ప్రాముఖ్యత ఏర్పడింది. సింగూరు డ్యామ్ ఎగువన మంజీరా నది పరీవాహకంపై 20 కిలోమీటర్ల మేర విస్తరించడంతో చేపల ఉత్పత్తికి డిమాండ్ పెరిగింది. ఈ డ్యామ్‌లో కొర్రమీను, తెల్లచేప, బొచ్చ రకాలు అందుబాటులో ఉన్నాయి.
- సింగూరు డ్యామ్‌లో ప్రభుత్వం ఏటా 60 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేస్తున్నారు. దీనికి తోడు సహజంగా ఉత్పత్తి అయ్యే చేపలు అదనం. డ్యామ్ పరీవాహక ప్రాంతం ఎక్కువగా ఉండటం, స్వచ్ఛమైన నీరు కలిగి ఉండటం, చేపలు ఈదటానికి 20 కిలోమీటర్ల మేర పరీవాహక ప్రాంతం ఉండటంతో చేపలు నాణ్యతతో పెరుగుతున్నాయి. దీంతో సింగూరు చేప రుచికరంగా ఉండటంతో వీటికి భలే గిరాకీ ఉంది.



చేపలతో వంటకాలు చేస్తున్న దృశ్యం

వందల మందికి ఉపాధి

- సింగూరు ప్రాజెక్టు ఎగువ, దిగువ గ్రామాల్లో ప్రభుత్వం గుర్తించిన మత్స్యకారులున్నారు. వందల సంఖ్యలో ఉన్న ఈ మత్స్యకారులు సింగూరు డ్యామ్‌పైనే ఆధారపడి చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం వారికి చేపలు పట్టడానికి అవసరమైన వలలు, వాహనాలు, క్రమవిక్రయాల సామగ్రి రాయితీపై అందిస్తోంది.
- సింగూరు జలాశయంలో వివిధ రకాల చేపలు పెరుగుతున్నాయి. ఈ చేపల వంటకాలు చేస్తూ పర్యాటకులకు పసందైన విందును అందించటానికి డ్యామ్ సమీపంలో కొన్ని కుటుంబాలు గుడారాలు వేసుకున్నాయి. రోజుకు టన్నుల కొద్ది చేపలతో రుచికరమైన వంటలు చేస్తున్నారు. సింగూరు జలాశయంలో చేపలు పట్టే మత్స్యకారులతో పాటు, రుచికరమైన వంటలు చేస్తూ మరికొన్ని కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి.

పసందైన వంటకాలు



చేపలతో రకరకాల వంటకాలు తయారు చేస్తున్నాం. డ్యామ్ చూడడానికి వచ్చే పర్యాటకులకు పసందైన విందు అందిస్తున్నాం. జంట నగరాల నుంచి వచ్చేవారే అధికం. అందులో యువకులే ఎక్కువ. సింగూరు చేపలంటే లొట్టలేసుకుని తింటారు.
– ముజీబ్, ఫిష్ కర్రీ మేకర్, సింగూరు

మార్కెట్ ఏర్పాటు చేయాలి



సింగూరు పరీవాహక ప్రాంతంలో చేపల ఉత్పత్తి అధికం. మత్స్యకారులకు ఇదే జీవనాధారం. సింగూరులో చేపల విక్రయ కేంద్రం ఏర్పాటు చేస్తే మత్సకారులకు ఏ ఇబ్బంది ఉండదు. చేపలు అమ్ముకోవడానికి సులువుగా ఉంటుంది.
– నందికంటి శ్రీనివాస్, సింగూరు మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు

ఆదరణ పెరిగింది



పర్యాటకుల సందడితో వ్యాపారాలు బాగా నడుస్తున్నాయి. చేపల కోసమే సింగూరుకు ఎక్కువ మంది పర్యాటకులు వస్తారు. ప్రభుత్వ అతిథిగృహాలు, టూరింజం హోటళ్లు విస్తరించాలి. ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.
– సంగమేశ్వర్ గౌడ్, వ్యాపారి

‘కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాలు మానుకోవాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్‌లోని బాలికల గురుకుల కళాశాలలో విద్యార్థిని ప్రసవించిన విషయంలో కాంగ్రెస్ నాయకులు స్వార్థ రాజకీయాల కోసం నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. గురుకులాన్ని ఆదివారం సందర్శించిన ఆయన సిబ్బంది, విద్యార్థినులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మైనార్టీ బాలికల పాఠశాల రావడం అరుదని తెలిపారు. వారి భవిష్యత్ అభ్యున్నతి కోసం బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను ఏర్పాటు చేయించి బ్రహ్మాండంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థిని తన గ్రామంలో చేసిన తప్పువల్ల కళాశాలలో గమనించకుండా నిర్లక్ష్యం వహించినందున ప్రిన్సిపాల్, డిప్యూటీ వార్డెన్, నర్సును విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు విద్యార్థినుల జీవితాలను పణంగా పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్ మాజీద్, కోఆప్షన్ సభ్యులు లయక్, సాబేరాబేగం, మాజీ ఎంపీటీసీ ముజామ్మిల్, బీఆర్ఎస్ కంగ్టి మండల అధ్యక్షుడు గంగారాం, ఖేడ్ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షుడు గౌస్‌చిస్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మూడో రోజు వంటావార్పు



ఆందోళన చేస్తున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు

హత్నూర(సంగారెడ్డి): కాలుష్యకారక పరిశ్రమ పనులు నిలిపివేసే వరకు ఆందోళన విరమించేది లేదని పరిశ్రమ పరిసర గ్రామాల ప్రజలు మూడో రోజు ఆదివారం స్పష్టం చేశారు. హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులోని సురభి లాబరేటరీస్ పరిశ్రమ నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు చేపట్టిన ఆందోళనకు మద్దతుగా ఆదివారం అయా పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, ఉపసర్పంచ్ సురేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ఆంజనేయులు గౌడ్, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివ శంకర్ రావ్, మండల ఉపాధ్యక్షుడు కర్రే కృష్ణ, వెంకట్‌రావ్, ప్రసాద్, తెలంగాణ జాగృతి జిల్లా కన్వీనర్ ప్రవీణ్ రావ్ పాల్గొన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు



కుస్తీ పోటీల్లో మల్లయోధులు

కల్హేర్(నారాయణఖేడ్): హనుమాన్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని రాపర్తిలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు విశేషంగా అలరించాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీ పోటీలో విజేతకు వెండి కడెం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంద శ్రావణ్ కుమార్, గ్రామస్తులు అంజయ్య, పరంధములు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సాయిలు

నారాయణఖేడ్: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల సాధనకు ఈనెల 25వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్ 82 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిలు అన్నారు. నారాయణఖేడ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన యూనియన్ సమ్మె సన్నాహక సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సంస్థల్లో గతేడాది నుంచి పీఆర్సీ పెండింగ్‌లో ఉందన్నారు. సంస్థలో పనిచేస్తున్న 23వేల మంది కార్మికులను రెగ్యూలర్ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, బ్రిటీష్ కార్మిక చట్టాలనే అమలు చేస్తున్నారని మండిపడ్డారు. 29 డిమాండ్ల సాధన కోసం అనేకసార్లు నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. అందుకే ఈనెల 25 నుంచి సమ్మె చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దశరథ్, దుర్గానాయక్, సాయిలు, శశికాంత్, రఘు, వేణు, మౌలానా, పవన్‌పటేల్, లక్ష్మణ్, శ్రీధర్, ముక్తార్, రాజేందర్, సాయిలు పాల్గొన్నారు.

నేడు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

నారాయణఖేడ్: ఉమ్మడి మెదక్ జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు సదాశివపేట మైనార్టీ గురుకుల పాఠశాలలో రెజ్లింగ్‌లో సంగారెడ్డి జిల్లాస్థాయి అండర్ 17 బాలబాలికల విభాగంలో ఎంపికకు పోటీలు జరుగుతాయని అసోసియేషన్ బాధ్యులు సంగ్రాం, జైపాల్, నెహ్రూ తెలిపారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారిని ఈనెల 11న హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల రెజ్లింగ్ క్రీడాకారులు తమతమ ఆధార్‌కార్డు, టెన్త్ మెమోతో ఎంపిక పోటీలకు హాజరు కావాలని కోరారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



మాట్లాడుతున్న విల్సన్

సంగారెడ్డి టౌన్: ఈస్టర్ వేడుకలను సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి సనత్‌నగర్ సీఎస్ఐ కార్చిబ్ ప్రెసిబిటరీ ఇన్‌చార్జి ఎం.విల్సన్ హాజరై మాట్లాడారు. అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే మానవత్వం అన్నారు. ప్రపంచానికి ఏసుక్రీస్తు బోధనలు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్త జన సంద్రంగా ఏడుపాయల



అమ్మవారి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ సాయి రమాదేవి

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గాభవానీ మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు తరలి వచ్చారు. హైకోర్టు రిజిస్ట్రార్ సాయి రమాదేవి, మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ రాధారెడ్డి, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ వైస్ చైర్మన్ రవిశేఖర్‌రెడ్డి, డీఎస్‌ఓ రాజిరెడ్డి, ఎంఈఓ నీలకంఠం దుర్గమ్మ తల్లిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

12న జోగిపేటకు మంత్రి హరీశ్‌రావు రాక

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ కేంద్రమైన అందోల్, జోగిపేటలో ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖా మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈనెల 12వ తేదీన పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటలకు జర్నలిస్టులకు ఇళ్ల పట్టాల పంపిణీ, 11.30 గంటలకు హైవే రోడ్డు నుంచి అందోల్ వరకు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన, 12 గంటలకు అందోల్‌లోని లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. అనంతరం భోజన విరామం, మధ్యాహ్నం 2 గంటలకు అందోలులోని స్వామి వివేకానంద విగ్రహం వద్ద యోగా సెంటర్‌కు శంకుస్థాపన, 2.30 గంటలకు అందోల్‌లోని డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం, 3 గంటలకు అందోల్‌లోని బస్తీ దవాఖాన ప్రారంభోత్సవం, 3.30 గంటలకు రూ.2 కోట్ల టీఎస్‌యుఐడీఎఫ్ నిధులతో మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, సాయంత్రం 4 గంటలకు రూ.జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో రూ.25 కోట్ల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన, 4.30 గంటలకు జోగిపేట ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్ ప్రారంభం, సాయంత్రం 4.45 గంటలకు జోగిపేటలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ, 5 గంటలకు జోగిపేటలో పునఃరుద్ధరించబడిన క్లాక్‌టవర్ ప్రారంభం, 5.10 గంటలకు బహద్దూర్ ఖాన్ ఫంక్షన్ హాల్, షాదీఖానా పనులకు శంకుస్థాపన, జోగిపేటలోని 252 డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం, 7 గంటలకు జోగిపేట నుంచి హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోతారని అధికారులు పేర్కొన్నారు.

ప్రతి గ్రామంలో మహనీయుల విగ్రహాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల తండా, 13న కొల్లూరు గ్రామంలో, 14న పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ చౌరస్తాలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాలను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 16వ తేదీన బీరంగూడ చౌరస్తాలో మహాత్మ బసవేశ్వరుడి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇస్నాపూర్ చౌరస్తాలో చిట్కుల్ గ్రామానికి వెళ్లే ముఖ ద్వారం వద్ద ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పటాన్‌చెరు డివిజన్ జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం ఏర్పాటుకు జాతీయ రహదారి పక్కన.. 500 గజాల స్థలం కేటాయించడంతో పాటు రూ.6 కోట్ల నిధులు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మొత్తం ఐదు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టి, మొదటి అంతస్తులో వార్డు కార్యాలయం, మిగిలిన అంతస్తుల్లో ప్రెస్ క్లబ్, వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజల కోసం వారివారి భాషల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. త్వరలో నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రక్రియ తుది దశకు చేరుకుందని తెలిపారు. సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో ప్రధాని మోదీ సీఎం కేసీఆర్ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కుటుంబ పరిపాలన గురించి ప్రధాని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని, దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీలతో కలిసి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తూ.. మరోపక్క కుటుంబ పాలన అంటూ మాట్లాడడం ప్రధాని విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తుల కోలాహలంతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల ముగిసినా.. క్షేత్రానికి భక్తుల తాకిడి తగ్గలేదు. స్వామి వారిని సుమారు 20 వేల మంది దర్శించుకోని మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు ఆలయ వసతి గదులు, ప్రయివేటు వసతి గదులలో బస చేసి ఆదివారం వారం ఉదయాన్నే కేశఖండన చేసుకొని స్వామి వారి పుష్కరణిలో స్నానమాచరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని, అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడిబియ్యం, గంగిరేణిచెట్టు ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఈఓ బాలాజీ శర్మ, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గంగిరేణి చెట్టు ప్రాంగణంలో భక్తుల కోలాహలం

మల్లన్నకు వెండి కోరమీసాలు

కొమురవెల్లి మల్లన్నకు లకుడారంకు చెందిన లంబ మైసయ్య కుటుంబం రూ.50 వేల విలువైన 680 గ్రాముల వెండి కోరమీసాలను ఆలయ ఈఓ బాలాజీకి అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పనికి తగ్గ ఫలమేది?

అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్న ఈజీఎస్ ఉద్యోగులు

సంగారెడ్డి మున్సిపాలిటీ: దేశానికి పల్లెలు పట్టుకొమ్మలు.. పల్లెల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యాయి అంటే అందులో ఉపాధి హామీ సిబ్బంది పాత్ర కీలకం. ఇంకుడు గుంతలు, ఇంటి ఎదుట మొక్కలు నాటడం వంటి పనులపై ఈజీఎస్ సిబ్బంది పూర్తి బాధ్యత వహిస్తూ విధులు నిర్వర్తిస్తుంటారు. ఉపాధి హామీ పథకంలో వేలాదిమంది కూలీలను సమన్వయం చేస్తూ వారికి పనులు కల్పిస్తూ గ్రామ అభివృద్ధిలో భాగ్యస్వాములు అవుతున్న తమకు పనికి తగ్గిన వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ సేల్స్ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించింది. దీంతో గ్రామాల్లో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేసే ఉపాధి హామీ ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఐకేపీ సేల్స్ ఉద్యోగులకు ప్రకటించిన విధంగానే తమకు పీఆర్సీ ప్రకటించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఈజీఎస్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 167 మంది

- ఉపాధి హామీ పథకం పనులను గ్రామాల్లో కూలీలతో చేయించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు ఉంటారు. వీరు కాకుండా మండల స్థాయిలో వివిధ హోదాల్లో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీఓలు, జేఏలు మొత్తం 167 మంది ఉన్నారు. ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పేస్కేల్ అమలు చేయాలని వేడుకుంటున్నారు.
- ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఉద్యోగులకు పేస్కేల్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అందుకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. అందుకనుగుణంగా నిధులు కేటాయిస్తారనే ఆశలో ఉపాధి హామీ ఉద్యోగులు ఉన్నారు.



పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు(ఫైల్)

పే స్కేల్ ఇవ్వాల్సిందే..



ఉపాధి హామీ పథకంలో ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరించాలి. రెగ్యూలర్ చేస్తారనే ఆశతో విధులు నిర్వర్తిస్తున్నాం. సెర్ప్ ఉద్యోగుల మాదిరిగా ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయాలి.
– శ్రీనివాస్, ఈజీఎస్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు

క్లుప్తంగా

ముగ్గురిపై కేసు నమోదు

పటాన్‌చెరు టౌన్: పెళ్లి కాకుండానే కట్నం వేధింపులకు గురి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు పట్టణానికి చెందిన జంగయ్య కూతురు యామినికి, భానూర్ కంచర్ల గూడెంకు చెందిన నర్సింలు, లక్ష్మిల కుమారుడు శంకర్‌తో మార్చి 26న నిశ్చితార్థం జరిగింది. మే 4న వివాహం జరగనుంది. అయితే పెళ్లికి ముందే కట్నం డబ్బులు, బైక్ ముందే ఇవ్వాలని పెళ్లికూతురికి ఫోన్ చేసి శంకర్ ఇష్టంవచ్చినట్లు మాట్లాడంతో శనివారం భవనంపై నుంచి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. ఈ విషయంలో శంకర్, తల్లిదండ్రులు నర్సింలు, లక్ష్మిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

విద్యుదాఘాతంతో వేరు వేరు ఘటనలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.

తొగుట(దుబ్బాక): గ్రామస్తులు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం...రాయపోల్ మండలంలోని ఎల్కల్ గ్రామానికి చెందిన సత్తగల్ల సాయిలు(55) కొన్ని రోజులుగా డీసీఎం వాహనంపై కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగా ఎల్లారెడ్డిపేట బైతి తిరుపతి పొలంలో కోడిఎరువు తోడేందుకు వెళ్లాడు. డీసీఎం వాహనం నుంచి ఎరువుతోడుతుండగా హైటెన్షన్ వైరు చేతికి తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. వెంటనే తోటి కార్మికులు చికిత్స కోసం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాయిలు మరణించాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గజ్వేల్‌ల్లో రైతు...


గంగాధర్‌గౌడ్ మృతదేహం

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బెజుగామలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గంగాధర్‌గౌడ్(47) తనకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో వివిధ పంటలను సాగుచేసుకుంటున్నాడు. ఆదివారం రాత్రి తా ను సాగుచేసిన వరి పొలానికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

జింకను కాపాడిన అటవీశాఖ అధికారులు

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో వ్యవసాయ పొలాల వద్ద బావిలో ప్రమాద వశాత్తు జింక పడింది. చుట్టు ప్రక్కల వారు గమినించి ఈ విషయాన్ని అటవీ శాఖ సిబ్బందికి సమాచారం చేరవేశారు. అక్కడికి చేరుకున్న అధికారులు బావిలో నుంచి జింకను తీశారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వరికి తెగులు..!

పరేషాన్‌లో రైతాంగం
- తెల్లబడి తాలు పోతున్న వరి
- గింజ గట్టిపడకుండా పొల్లుపోతున్న పంట
- ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం
- జిల్లాలో పెద్ద ఎత్తున నష్టం


తెల్లబడి తాలుపోయిన వరి

దుబ్బాకటౌన్: ఎంతో ఆశతో వేసుకున్న వరిపంట చేతికొస్తుందనుకుంటే ఒకానొక దశలో తెగులు రావడంతో రైతులు దిగులు పడుతున్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్‌కు చెందిన కొండె ఎల్లారెడ్డి తనకున్న 10 ఎకరాల్లో వరి పంట వేసిండు. తీరా ఈని గొలుసులు భయటకు వచ్చాక గింజ గట్టి పడకుండా తాలుపోయి(పొల్లు) తెల్లగా నిలబడిపోతుంది. ఎన్ని మందులు స్ప్రే చేసినా ఫలితం లేదు. ఇప్పటికే సావుకారి వద్ద అప్పు తెచ్చి రూ.2 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టినా ప్రయోజనం లేదు. అందరి చేలు గిట్లనే గొలతాలు పోతున్నాయి.

తాలు పోతున్న... వరి గొలుసులు

మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుంది. రైతన్నల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకొని..అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తే పెట్టుబడులు ఎల్లని దుస్థితి నెలకొంది. వానకాలంలో భారీ వర్షాలతో పంటలు బాగాదెబ్బతింది. ఈ యాసంగిలోనైనా పంటలు బాగాపండుతాయన్న గంపెడాశతో రైతన్నలు పెద్ద ఎత్తున వరిపంట సాగుచేశారు. వరి చేలు పొట్టదశకు వచ్చి ఈనుతున్న తరుణంలో గింజలు గట్టిపడకుండా తెల్లగా తాలు పోతుంది. దీంతో రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది.

జిల్లాలో 3.53లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో చెరువులు, కుంటల్లో సంవృద్ధిగా నీరుండడంతో రికార్డు స్థాయిలో 3.53 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాలో ముందుగా వేసిన వరి పంట ఈనుతున్నాయి. ఈ క్రమంలోనే చాల ప్రాంతాల్లో వరి చేలు ఈనినట్లుగా గొలుసులకు గింజలు పాలుపోసుకోకుండా అలాగే తెల్లబడి నిలబడిపోతున్నాయి. దుబ్బాక మండలంలోని చెల్లాపూర్, దుబ్బాకతోపాటు జిల్లాలోని చాల గ్రామాల్లో వరి పంటల పరిస్థితి ఇలాగే తయారైంది.

మొగిపురుగు, అగ్గి తెగులు

వరిచేలు ఈని గింజలు గట్టి పడకుండా తాలుపోవడం మొగిపురుగు, అగ్గి తెగులులో మెడవిరుపు రోగమే కారణమని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఇది వరకు అగ్గి తెగులు సోకిన భూముల్లో ఈ మెడవిరుపు తెగులు కనబడుతున్నాయని వారంటున్నారు. గత యాసంగి, వానకాలంలో సైతం ఇలాగే వరిపంటలకు నష్టం వాటిల్లాయని మళ్లీ ఇప్పుడు కనబడుతుందన్నారు. ప్రస్తుతం వరిపంటలపై మెడవిరుపు లక్షణాలు కనిపిస్తే ట్రై సైక్లోజన్ లేదా గెలిలియో సెన్స్ మందులు స్ప్రే చేయాలని అధికారులు సూచిస్తున్నారు.

చేను తెల్లగా మారింది



3 ఎకరాల వరిపంట వేసిన.. చేను మొత్తం ఈనుతుంది. ఈనిన గొలుసు పాలుపోసుకోకుండా గింజ గట్టిపడకుండా తెల్లగా గొలంతా నిలబడిపోతుంది. చేను తెల్లగా మారిందని మందు తెచ్చి కొట్టినా ఏం లాభం లేదు. వ్యవసాయాధికారి మేడం వచ్చి చూసింది. చేతికొస్తుందనుకున్న చేను దెబ్బతిని పంట నష్టమయింది.

–ఉప్పు తిరుపతి, రైతు, చెల్లాపూర్

అధికారుల సూచనలు పాటించాలి



ఈ యాసంగిలో పెద్ద ఎత్తున వరిపంటల విస్తీర్ణం పెరగడంతో రకరకాల తెగుల్లు వస్తున్నాయి. వరినాట్లు వేసిన మొదట్లో ఎదగకుండా ఎర్రబడడం..ఇప్పుడు వరిచేలు ఈని గొలుసులు పాలు పోసుకుని గింజగట్టి పడే క్రమంలో తాలుపోతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. వివిధ ప్రాంతాల్లోని వరి పంటలను పరిశీలించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పూర్తి అధ్యయనం చేస్తాం. రైతులు అధికారులు ఇచ్చిన సూచనలు తప్పకుండా పాటించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి పంట పరిశీలిస్తాం.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు


గాయపడ్డ బాలుడు

జిన్నారం(పటాన్‌చెరు): కుక్కల దాడిలో బాలుడికి గాయాలైన ఘటన మండలంలోని జిన్నారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యాదగిరి కుమారుడు రుత్విక్ ఆరుబయట ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కుక్కలు బాలునిపై దాడి చేశాయి. ఈ ఘటనలో చేతికి తీవ్ర గాయాలవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించారు.

సర్పంచ్ నీలం మధు ఆర్థిక సాయం

విషయం తెలుసుకున్న చిట్కుల్ సర్పంచ్ నీలం మధు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఇందుకు గాను యాదగిరి కుటుంబ సభ్యులు నీలం మధుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఊరకుక్కల దాడిలో లేగదూడ..

శివ్వంపేట(నర్సాపూర్): ఊర కుక్కల దాడిలో లేగదూడకు తీవ్ర గాయాలైన సంఘటన శివ్వంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రుస్తుంపేట శ్రీనివాస్ తన పశువులను వ్యవసాయ పొలం వద్ద పాకలో ఉంచగా ఊరకుక్కలు లేగదూడపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. లేకదూడ పరిస్థితి విషమంగా ఉందని బాధిత రైతు శ్రీనివాస్ పేర్కొన్నారు. కుక్కల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య


సంజీవులు (ఫైల్)

కౌల్సారం(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కౌల్సారం మండలం, వరిగుంతం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తిమ్మగళ్ల సంజీవులు(41) కూలీ పని చేస్తూ, భార్య ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సంజీవులు అనారోగ్యం పాలవడంతో కూలి పని చేసేందుకు శరీరం సహకరించకపోవడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా తయారైంది. కుటుంబ పోషణకు అప్పులు చేసేవాడు. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరామర్శ

కౌల్సారం జెడ్పీటీసీ మేఘమాల సంతోష్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేశారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు...


మృతుడు రవి

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాయపోల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం, వీరారెడ్డి పల్లి గ్రామానికి చెందిన వేముల రవి(32) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అతనికి వంశపారపర్యంగా వచ్చిన ఇల్లు కూలిపోవడంతో మళ్లీ ఇల్లును నిర్మించే స్తోమత లేక తీవ్ర మనస్థాపానికి గురై బుధవారం పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య వేముల మంజుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి..

డ్రైవర్, కండక్టర్‌తో సహా 10 మందికి గాయాలు


ప్రమాద బాధితులకు సాయం చేస్తున్న గ్రామస్తులు

వర్గల్(గజ్వేల్): ఆగిఉన్న లారీని ఢీ కొట్టిన ఘటనలో డ్రైవర్, కండక్టర్‌తో సహా 10 మంది గాయాలపాలైన ఘటన ఆదివారం ఉదయం వర్గల్ మండలం మజీద్‌పల్లి వద్ద జరిగింది. బేగంపేట ఎస్‌ఐ అరుణ్, ఆర్టీసీ డ్రైవర్ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గజ్వేల్ నుంచి సంగారెడ్డి వైపు 45 మంది ప్రయాణికులతో వెళ్తుంది. వర్గల్ మండలం మజీద్‌పల్లి స్టేజీ వద్ద కొద్దిమంది ప్రయాణికులు దిగారు. అక్కడి నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే రోడ్డు పక్కన ఆగిఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా ప్రయాణికులు కుదుపునకు గురయ్యారు. సీట్లను గుద్దుకొని గాయాలపాలయ్యారు. కొందరికి పళ్లు విరిగాయి. ఊహించని ఘటనతో ప్రయాణికులు బోరుమన్నారు. ఈ ఘటనలో మేడ్చల్ మండలం అత్వెల్లికి చెందిన చర్లపల్లి రామచంద్రయ్య(60), గజ్వేల్‌కు చెందిన విమల(34), కండక్టర్ శాంతాబాయి(49), డ్రైవర్ గడ్డం యాదయ్య(38)లతోపాటు మరో ఆరుగురు గాయపడ్డారు. వీరందరినీ 108 అంబులెన్స్‌లలో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన లారీ

జగదేవ్‌పూర్(గజ్వేల్): అదుపు తప్పి బొగ్గు లారీ బోల్తా కొట్టిన ఘటనలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మునిగడప గ్రామ సమీపంలో జరిగింది. ఎస్‌ఐ కృష్ణమూర్తి వివరాల ప్రకారం..భువనగిరి నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న బొగ్గు లారీ మునిగడప సమీపంలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద అదుపు తప్పింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు వెంటనే గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి మృత్యుఒడికి...


ర్యాకం గాలయ్య ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు


నితిన్(ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): స్నేహితులతో సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అల్వాల శివారులో ఆదివారం చోటు చేసుకుంది. దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డి గ్రామానికి చెందిన ర్యాకం గాలయ్య ఇంటి నిర్మాణ పనులకు అదే గ్రామానికి చెందిన మల్కపురం నర్సింహులు రాజమణి రెండో కుమారుడు నితిన్(18) కూలీ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగిసిన తర్వాత భాను ప్రసాద్, హరీశ్‌లు బైక్‌పై అల్వాలకు వెళ్లారు. అక్కడ కల్లు కాంపౌండ్‌లో కల్లు తాగినతరం కూడవెల్లి వాగులో సరదాగా ఈతకు వెళ్లారు. నితిన్ తోతుకెళ్లి ఈత కొట్టే క్రమంలో ఒడ్డుకు రాలేక విపరీతమైన శ్వాస తీస్తూ నీట మునిగి పోయాడు. ఇది గమనించిన స్నేహితులు భాను ప్రసాద్, హరీష్‌లు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. సమీప రైతులు విషయాన్ని తల్లిదండ్రులకు చేరవేశారు. గజ ఈతగాళ్ల సాయంతో నితిన్ శవాన్ని ఒడ్డుకు చేర్చారు.

మృతుని తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన

మృతుని తల్లిదండ్రులు, బంధువులు ర్యాకం గాలయ్యపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇంటి ముందు నితిన్ శవాన్ని ఉంచి ఆందోళనకు దిగారు. తన కుమారుడి మరణానికి భాను ప్రసాదే కారణమంటూ ఆరోపిస్తూ రోదించారు. తమకు న్యాయం జరిగే వరకు శవాన్ని తీసే ప్రసక్తే లేదని నిరసన చేశారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు నచ్చజెప్పారు. మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన సద్దుమణిగింది. మృతుడి తండ్రి నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం

భర్తకు తీవ్రగాయాలు


ఘటనాస్థలంలో గాయాలతో భర్త లింగాగౌడ్

వర్గల్(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో భార్య దుర్మరణం చెందగా, భర్త తీవ్రగాయాలపాలైన ఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్‌రహదారిపై చోటు చేసుకుంది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం...తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన దుద్దెడ లింగాగౌడ్, లక్ష్మీ(40) దంపతులు. బతుకుదెరువు నిమిత్తం కొంతకాలం నుంచి మేడ్చల్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం లింగాగౌడ్, లక్ష్మీ దంపతులు బైక్‌పై గౌరారంలో బంధువుల ఇంటికొచ్చి తిరిగి వెళ్తుతుండగా మార్స్ కంపెనీ దగ్గర బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న లక్ష్మీ ఎగిరి రోడ్డు రెండోవైపునకు పడిపోయింది. హైదరాబాద్ నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఆమెపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. భర్త గాయాలపాలయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

మినీ వ్యాన్ టైర్ పేలి...

ఒకరు మృతి.. నలుగురికి గాయాలు


మృతి చెందిన లాల్‌సింగ్ విశ్వకర్మ, బోల్తాపడిన మినీ వ్యాన్

మనోహరాబాద్(తూప్రాన్): బండల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్ టైర్ ఒక్క సారిగా పేలడంతో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. నలుగురికి గాయాలైన ఘటన దండుపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మేడ్చల్‌లోని ఎమ్మెఎస్ మార్బుల్ కంపనీ నుంచి హమాలీలు సురేశ్, లాల్‌సింగ్ విశ్వకర్మ, దిలీప్, పవన్, శివలు బండల లోడ్ వేసుకుని వస్తున్నారు. మార్గమధ్యలో దండుపల్లి శివారులోకి రాగానే హైవే–44పై మినీ వ్యాన్ టైర్ పంచర్ కావడంతో బోల్తా కొట్టింది. దీంతో వెనకాలె కూర్చున లాల్‌సింగ్ విశ్వకర్మ (42) అక్కడిక్కడే మృతి చెందాడు. వాహనంలో ఉన్న మిగతా వారికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

బావిలో మృతదేహం

బయటకు తీసిన పోలీసులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని వడియారం శివారులో పాడుబడిన బావిలో వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు బయటకు తీశారు. పోలీసులు స్థానికుల వివరాల ప్రకారం ...గ్రామంలోని బావి సమీపంలో ఆవైపుగా వెళ్తున్న కొందరికి వాసన రావడంతో వారు శనివారం పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చీకటిపడడంతో పోలీసులు ఆదివారం మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ విషయంలో స్థానికుల నుంచి వివరాలు సేకరించగా మృతుడు స్థానికవ్యక్తి కాదని వారు తెలిపారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన సంబంధికులు, బంధువులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్ స్టేషన్లో సంప్రదించాలన్నారు.

గంజాయి సరఫరా ముఠా అరెస్ట్

120కిలోలు స్వాధీనం


సమావేశంలో మాట్లాడుతున్నా డీసీపీ శిల్పవల్లి


పట్టుబడిన ముఠా సభ్యులు, గంజాయి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇతర రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి అమ్ముతున్న అంతరాష్ట్ర ముఠాను మాదాపూర్ ఎస్‌ఓటీ, రామచంద్రాపురం పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 120కిలోల గంజాయి, 2కార్లు, ఒక మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రంలోని మల్కన్‌గిరికి చెందిన దీపాకర్ గంజాయిని ప్యాకెట్లు చేసి వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన ప్రీతం రే, బిద్యుత్ రే వాహనాలలో గంజాయిని తరలిస్తు ఉంటారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో నివాసం ఉండే ఒరిస్సాకు చెందిన రాజేశ్ కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే అతను కూలీ పనులు మానేశాడు. తను కూలీ పనులు చేస్తున్నట్లుగా అక్కడున్న వారిని నమ్మిస్తూ తోటి భవన నిర్మాణ కూలీలకు గంజాయి అమ్మేవాడని వివరించారు. ప్రీతం రే మల్కన్‌గిరిలో గంజాయి సాగుచేసే వారి నుంచి తీసుకొచ్చి దీపాకర్, బిద్యుత్ రే ఇరువురు కలిసి గంజాయిని ఇతరప్రాంతలకు తరలించే వారు. కొల్లూర్‌లో ఉంటున్న రాజేశ్‌ను కలుపుకొని వారు గంజాయిని విక్రయించేవారు. ఈ నెల 7వ తేదీన 120కిలోల గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి రెండు కార్లలో దీపాకర్, బిద్యుత్ రేలు హైదరాబాద్ బయలుదేరారు. వారి కార్ల ముందు ప్రీతం రే మోటార్‌సైకిల్‌పై ఎస్కార్ట్‌గా వ్యవరించాడు. విశ్వసనీయమైన సమాచారం మేరకు రామచంద్రాపురం, మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు 8వ తేదీన ఉదయం కొల్లూర్‌లో నిఘా వేశారు. రాజేశ్ నివాసం ఉంటున్న ప్రాంతానికి వచ్చి వారు గంజాయి అందిస్తుండగా రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ సంజయ్, ఎస్‌ఓటీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ బృందం వారిపై దాడి చేసి ముఠాను అదుపులోకి తీసుకున్నారు. దీపాకర్ పోలీసుల కళ్లుగప్పి పరారయ్యాడు. పోలీసులు అదుపులోకి తీసుకున్నా వారి వద్ద నుంచి 120కిలోల గంజాయి, రెండు కార్లు, ఒక మోటార్‌సైకిల్, 4సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్నా నిందితులను రిమాండ్ చేసినట్లు డీసీపీ తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీ నర్సింహారావు, ఎస్‌ఐలు శశికాంత్ రెడ్డి, వెంకట్ పాల్గొన్నారు.